నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - మల్కాపురం: మల్కాపురం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 14వ తేదీన పాఠశాల బాలలకు దేశభక్తి గీతాల్లో పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న వ్యాసరచన, 17న కవి సమ్మేళనం, 18న క్విజ్ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సమావేశం, బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయని గ్రంథాల యాధికారి వి.అజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో మండల విద్యాధికారులు త్రినాథ్, వెంకట్రావ్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, స్థానిక మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

నాలుగు కారిడార్లలో మెట్రో రైల్ పనులు

కేంద్రం నుంచి అనుమతి రాగానే ప్రాజెక్ట్‌పై ముందుకెళ్తాం
అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రశ్నలకు పురపాలక మంత్రి నారాయణ సమాధానం వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్ట్‌కు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక (సీఎంపి) సిద్ధం చేసినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. ఈ ప్రణాళికను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే ప్రాజెక్ట్‌పై ముందుకెళ్తామన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో విశాఖకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు వెల్లా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2014 విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ఐటం 12 ప్రకారం విజయవాడ, విశాఖకు మెట్రో రైలుపై ఫీజిబులిటీ రిపోర్ట్ ఇవ్వాలని పొందుపరిచారన్నారు. దీని ప్రకారం 2014లో డీపీఆర్ సిద్ధం చేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు నాటి టీడీపీ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించిందన్నారు. ఆ తర్వాత 2015లోనే డీఎంఆర్సీ ఏపీ ప్రభుత్వానికి నివేదిక అందించిందని, విశాఖకు సంబంధించి 42.5 కిమీల నెట్‌వర్క్‌తో మూడు కారిడార్లతో మీడియం మెట్రో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇచ్చారన్నారు. 2019 ఏప్రిల్‌లో టెండర్లు పిలవగా కొన్ని కంపెనీలు బిడ్లు కూడా దాఖలు చేశాయన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసి ఉంటే విశాఖతో పాటు విజయవాడకు మెట్రో రైలు వచ్చి ఉండేదన్నారు. కానీ విశాఖపట్నంలో భోగాపురం వరకూ పొడిగింపు సాకుతో ప్రాజెక్ట్‌ను పెండింగ్‌లో పెట్టేసారని మంత్రి నారాయణ తెలిపారు.

తిరిగి 2020 మార్చి 19 వ తేదీన గుర్గాంకు చెందిన వీఎంటీసీ అనే కంపెనీకి విశాఖ మెట్రో డీపీఆర్ బాధ్యతలు అప్పగించగా, మొత్తం 76.9కిమీతో 14,300 కోట్ల ఖర్చుతో నాలుగు కారిడార్లలో ఏర్పాటుకు డీపీఆర్ ఇచ్చిందన్నారు. 2021 ఏప్రిల్‌లోనే డీపీఆర్ ఇచ్చినప్పటికీ 2023 డిసెంబర్ 15వ తేదీ వరకూ వైసీపీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలకత్తా మెట్రో రైల్ తరహాలో వందశాతం కేంద్రప్రభుత్వం భరించేలా రైల్వే శాఖకు అప్పగించేలా కేంద్రం ముందు ప్రతిపాదన ఉంచామన్నారు. దీనికి సంబంధించి స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రికి లేఖ ఇవ్వడంతో పాటు సీఎం చంద్రబాబు కూడా ప్రధాని మోడీకి లేఖ రాసారని చెప్పారు. రెండు దశల్లో నాలుగు కారిడార్లలో మెట్రో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. మొదటి దశలో 46.23 కిమీ మేర మూడు కారిడార్లలో నిర్మాణం చేస్తామన్నారు. మొదటి కారిడార్ ను స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ 34.4 కిమీ మేర రెండో కారిడార్‌లో గురుద్వార నుంచి ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ వరకూ 5.07 కిమీ మేర మూడో కారిడార్ లో తాటిచెట్లపాలెం నుంచి చిన వాల్తేరు వరకూ 6.75 కిమీ మేర ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. మొత్తంగా 46.23 కిమీ మేర 42 స్టేషన్లతో నిర్మించే ప్రాజెక్ట్‌కు 11,498 కోట్లు ఖర్చవుతుందని అంచానా వేసామన్నారు. ఇక రెండో దశలో కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్ పోర్ట్ వరకూ 30.67 కిమీ మేర 12 స్టేషన్లతో మెట్రో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. అయితే విశాఖ మెట్రో కారిడార్ వెళ్లే మార్గంలో ఎక్కువ క్రాసింగ్స్ వస్తున్న అంశాన్ని కూటమి నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రతి క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా కార్ షెడ్, ఎండాడ, హనుమంతవాక, మద్దిలపాలెం, విప్రో జంక్షన్, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్ల పాలెం, గాజువాక, స్టీల్ ప్లాంట్ జంక్షన్‌ల వద్ద టూ లెవల్ మెట్రో ఫ్లై ఓవర్‌లు నిర్మించే ప్రతిపాదన కూడా చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

లోకేష్‌ని కలిసిన ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ప్రణవ్ గోపాల్ కుటుంబ సమేతంగా మంత్రి నారా లోకేష్‌ని మర్యాద పూర్వకంగా కలిసారు. తనను వీఎంఆర్డీఏ చైర్మన్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాల బహుకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఇటీవల సంభవించిన విజయవాడ వరదల సమయంలో 46వ వార్డు నుంచి విజయవాడ వెళ్లి విశేష సేవలందించిన శానిటేషన్ సిబ్బందికి నూతన వస్త్రాలను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పంపిణీ చేశారు. స్థానిక సాంతినగర్ వార్డు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కటుమూరి సతీష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి పనిచేసే శానిటేషన్ సిబ్బంది సేవలను ఎంత కీర్తించినా తక్కువేనని అన్నారు. ముఖ్యంగా ఇటీవల సంభవించిన విజయవాడ వరదల నేపథ్యంలో అక్కడి వరద బీభత్సం కారణంగా ఏర్పడిన వ్యర్థాలను తొలగించి అక్కడి ప్రజల జీవనాన్ని సాధారణ స్థితికి తీసుకొని రావటానికి విశాఖ నుంచి వెళ్లిన సిబ్బంది ఎంతో శ్రమించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, కె.చిన్నా, సోమునాయుడు, వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యం, సచివాలయం సెక్రటరీ రమేష్, వార్డు సూపర్‌వైజర్లు రామారావు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా

విశాలాంధ్ర - భీమిలి: మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో భీమిలి జోనల్ కార్యాలయంలో మహాధర్నా, రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు స్థానిక ఎగువపేట గ్రామభివృద్ధి సేవా సంఘం ప్రెసిడెంట్ గంటా నూకరాజు తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సముద్ర తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాలు (విశాఖపట్నం, తిమ్మాపురం, మంగామారిపేట, ఉప్పాడ, ఎగువపేట, బోయ వీధి, తోట వీధి, పెద్ద, చిన్న నాగమయ్యపాలెం, అన్నవరం) యొక్క గ్రామస్తులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాటితూరు, తాళ్లవలసలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - తగరపువలస: తాటితూరు, తాళ్లవలస గ్రామంలో ప్రభుత్వ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ అధికారిణి బి.శివకోమలి మాట్లాడుతూ ఖరీఫ్ 2024కు సంబంధించి పండించిన ధాన్యానికి గాను నవంబర్ చివరి వారంలో పభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సంవత్సరానికి గాను ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకంకు క్వింటా ధర రూ.2300, గ్రేడ్ 'ఎ' రకంకు క్వింట ధర రూ.2320/- ఉందని తెలిపారు. కార్యక్రమంలో సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు డైరెక్టర్ మన్మదరావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది స్వాతి, కృపామని, హరీష్, రమేష్ రైతులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి అపార్ తప్పనిసరి: డీఈవో ప్రేమ్ కుమార్

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జిల్లా విద్యా శాఖాధికారి యన్.ప్రేమకుమార్ గాజువాక, పెదగంట్యాడ, ములగాడ మండలాలలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో స్థానిక యస్‌యఫ్‌యస్ పాఠశాలలో బుధవారం జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుచున్న ప్రతీ విద్యార్థి భవిష్యత్‌కి అత్యంత అవసరమైన (అపార్) ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీని వెంటనే పాఠశాలల లాగిన్‌లో ఆన్లైన్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏ స్కూల్ లాగిన్ లోనైనా డ్రాప్ బాక్స్‌లో ఒక్క విద్యార్థి కూడా ఉండడానికి వీలు లేదని వెంటనే తొలగించాలని, అదే విధంగా ఫార్మాటివ్ 1,2 పరీక్షల మార్కులు వెంటనే ఆన్లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పాఠశాలలో చదవని విద్యార్థులు పాఠశాల లాగిన్‌లో ఉండరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యా శాఖాధికారి రవీంద్ర బాబు, గాజువాక, పెద్ద గంట్యాడ, మూలగాడ మండల విద్యాశాఖాధికారులు సునీత, విశ్వనాథం, శ్రీనివాస్,రమణాజీ, వెంకటరావు, త్రినాధరావు, సీఆర్పీలు, జిప్సా సభ్యులు భాస్కరరావు, శ్రీనివాసరావు, షణ్ముఖరావు, బాబురావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జేవి ప్రభాకర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బడ్జెట్ కేటాయింపుల్లో దళితులకు జరిగిన అన్యాయాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సరిదిద్దాలని, బడ్జెట్ కేటాయింపులను సక్రమంగా చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ అంబేద్కర్ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరాలకు సంబంధించి గత రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని, ఈ సంవత్సరానికి సంబంధించి రెండు లక్షల 94 వేల కోట్ల రూపాయలు ప్రతిపాదించారన్నారు. రెండు లక్షల 34 లక్షల కోట్లు లోటు, రాబడి, బడ్జెట్ 34745 కోట్లుగా చూపించారని, పాఠశాల విద్యకి 29 వేల కోట్ల రూపాయలు, వ్యవసాయానికి 49 వేల కోట్లు కేటాయించారన్నారు. కానీ ఎస్సీ సంక్షేమం 16శాతం ప్రకారంగా 48 వేల కోట్ల రూపాయలు రావలసి ఉండగా, అది 18 వేల కోట్ల 497 కోట్లు మాత్రమే కేటాయించారని, ఎస్టీ సంక్షేమానికి 21 వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉండగా, 7557 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది ఈ బడ్జెట్లో దళితులకు తీవ్రమైనటువంటి అన్యాయం జరిగిందన్నారు. కాబట్టి వెంటనే వారికి రావాల్సినటువంటి వాటా కేటాయించ వలసిందిగా కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ మూడు భాగాలుగా విభజించి, రెల్లి, మాల, మాదిగ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ప్రైవేట్ కాలేజీలో చదువుతున్న పీజీ విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్‌ను రద్దు చేశారని, అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి నిధులు తగ్గించారన్నారు. గత ఐదు సంవత్సరాలలో ఒక ఆటో గాని ఒక ట్రాక్టర్ గాని ఒక ఎకరం భూమి గానీ కొనుగోలు చేయలేదన్నారు. భూమి కొనుగోలు పథకాన్ని కూడా రద్దు చేశారన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే ఎస్సీలకు కేటాయించవలసిన 48 వేలు కోట్ల రూపాయలు కేటాయించాలని (16శాతం) డిమాండ్ చేశారు. అలాగే రద్దు చేసిన 28 పథకాలను అమలు చేయాలన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ వారికి వినతి పత్రాలు సమర్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు, మాటూరి శ్రీనివాసరావు, పతివాడ రాంబాబు, అప్పలకొండ, రాజన సరస్వతి పాల్గొన్నారు.

రామవరంలో నిత్యం విద్యుత్ సరఫరాకు లైన్లు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని రామవరం గ్రామపంచాయతీలో గృహ అవసరాలకు ఉపయోగించే విద్యుత్ సరఫరా నిత్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రామవరం గ్రామంలో మూడు ఫేస్‌లలో 24 గంటలు విద్యుత్ సరఫరా బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ మధు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్, స్థానిక సర్పంచ్ యర్ర రాజు, ఎంపీటీసీ కృష్ణ, మాజీ సర్పంచ్ వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్కుల్లో బాలలకు ఉచిత ప్రవేశం

విశాలాంధ్ర - విశాఖ: బాలల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ)కి చెందిన సెంట్రల్ పార్కు, కైలాసగిరి, తెలుగు మ్యూజియం, సబ్ మెరైన్ మ్యూజియం, టి.యు-142, తొట్లకొండ, వి.ఎం.ఆర్.డి.ఏ. పార్కుల్లో బాలలకు ఉచిత ప్రవేశం ఉంటుందని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని బాలలు ఉపయోగించుకోవాలని కోరారు.

నకిలీ పోలీసు అరెస్టు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడలో వంతల సంతోష్ (32) అనే వ్యక్తి నకిలీ పోలీస్ అవతారం ఎత్తి పోలీస్ డ్రెస్‌తో పలువురును మోసగిస్తున్నందున పీఎం పాలెం క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బైక్, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆరిలోవలో నిందుతుడిపై గతంలో రెండు కేసులు ఉండడంతో, నిందితుడిని దర్యాప్తు కోసం ఆరిలోవ స్టేషనుకు పీఎం పాలెం పోలీసులు తరలించారు. నిందితుడు పోలీస్ కానిస్టేబుల్‌గా చలామణి అవుతూ, పలుచోట్ల దందాలు చేస్తూ, అక్రమాలకు పాల్పడుతూ, అందరినీ బెదిరిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడని పోలీసులు విచారణలో వెల్లడైంది. నిందితుడిపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఉన్న కేసులపై విచారణ చేపట్టి అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిల్లర వర్తకులకు హాకర్ జోన్ ఏర్పాటు చేయాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి వామనమూర్తి డిమాండ్

విశాలాంధ్ర - సాగర్ నగర్: భీమిలి బీచ్ రోడ్డు తొట్లకొండ వద్ద ఎన్నిమాంబ గుడి వద్ద డి.కార్తీక్ అధ్యక్షతన చిల్లర వర్తకులు, ఫోటోగ్రాఫర్ల జనరల్ బాడీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి విశాఖ జిల్లా ఫుట్‌పాత్ అండ్ తోపుడుబళ్లు, ఫోటో గ్రాఫర్స్ కార్మిక వెల్ఫేర్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొని మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 2014 వీధి వ్యాపారుల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, తొట్లకొండ బీచ్ వద్ద చిల్లర వర్తకులకు హాకర్ జోన్లు కట్టించి ఇవ్వాలని, కార్మికులందరికీ జీవీఎంసీ, వుడా అధికారులు ఫోటో గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. చిల్లర వర్తకులందరికీ హామీలు లేని జాతీయ బ్యాంకులు ముద్రణా లోన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీధి విక్రయిదారులకు సుప్రీంకోర్టు 2014లో చేసిన చట్టాన్ని విశాఖలో అమలు చేయకపోవడంతో వుడా, జీవీఎంసీ, పోలీస్ అధికారులు వేధింపులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ బీచ్‌ను టూరిజంగా అభివృద్ధి చేసే క్రమంలో తొట్ల కొండ బీచ్ వద్ద చిల్లర వర్తకులకు మరుగుదొడ్లు, విద్యుత్తు సదుపాయంతో కూడిన షాపులు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. చిల్లర వర్తకల బ్రతుకు రక్షణ కల్పించే పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ చట్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు డి.కార్తీక్, రావికృష్ణ, ఎస్.రాజు, డి.దేవుడమ్మ, కే.శివ, ఎం.ప్రదీప్, ఆర్.శ్యాము తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్ డివిజనల్ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఇతర విభాగాల అధికారులు భాగస్వామ్యమయ్యారు. సమావేశంలో భాగంగా ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు చేరువ చేయాలని, అన్ని విధాలుగా వారికి అండగా నిలవాలని ఆర్డీవో ఈ సందర్భంగా సూచించారు. డివిజన్, మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ, దర్యాప్తు విషయంలో జాగ్రత్త వహించాలని, బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. నగర పరిధిలోని ఏసీపీలు, తహశీల్దార్లు, జీవీఎంసీ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యు-17లో రెండో స్థానం

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీల్లో సింహాచలం ఎంజెపి సింహాచలం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి జె.సంతోష్ ప్రతిభ సాధించాడు. 10వ తరగతి విద్యార్థి సంతోష్ ఏలూరు జిల్లా చింతలపూడిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలలో విశాఖ జిల్లా యు-17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. విజయం సాధించిన సంతోష్‌ను ఎంజేపీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.రమా మోహిని, అధ్యాపక సిబ్బంది అభినం దించారు. సంతోష్ విజయం సాధించటానికి సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.దుర్గా ప్రసాద్, డి.అప్పారావులను అభినందించారు.

విజ్ఞానదాయకంగా బాలల సైన్స్ కాంగ్రెస్

విశాలాంధ్ర - మధురవాడ: బాలలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడానికి, నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జెఎన్‌వి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ -2024 విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతోంది. ముఖ్యంగా సముద్ర శాస్త్ర వింతలు, విశేషాల నుంచి నానో సైన్స్, కృత్రిమ మేధ వరకు శాస్త్రవేత్తల ప్రసంగాలను ఏర్పాటు చేయడంతో విజ్ఞానదాయకంగా సైన్స్ కాంగ్రెస్ కొనసాగుతోంది. గీతంలో జరుగుతున్న సైన్స్ కాంగ్రెస్‌లో బుధవారం జరిగిన శాస్త్రవేత్తల ప్రసంగాలు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం ఆసక్తికరమైన చర్చలకు వేదికగా మారింది. ఎన్ఐఓ శాస్త్రవేత్త డాక్టర్ వివిఎస్ఎస్.శర్మ తన ప్రసంగంలో సముద్రాలలోని జీవరాశులు వాటిలో ఔషధ గుణాలు, సముద్ర గర్భంలో లభించే ఖనిజాలు, సముద్ర అలల నుంచి విద్యుత్తు ఉత్పాదన వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ మరియు శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఎస్.వేణుగోపాల్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవిశంకర్, గీతం జీవ శాస్త్ర విభాగాల డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

15న పుణ్యనదీ హారతి



విశాలాంధ్ర - సింహాచలం: రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి వరాహ పుష్కరిణిలో ఈనెల 15వ తేదీన పుణ్యనదీ హారతి కార్యక్రమం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు తెలిపారు. స్వామి వారి అనుబంధ దేవాలయం శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి వేద, వాయిద్య ఘోషలతో, ఛత్ర, చామరాలతో, దేవ కళికలతో, పుణ్యస్త్రీలు బయలు దేరి సాయంత్రం గం.5ల సమయంలో శ్రీ వరాహ పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. కార్యక్రమంలో ఉత్సాహవంతులైన భక్తులు, స్త్రీలు, పురుషులు, పెద్దలు, పిల్లలు పాల్గొని కార్తీక పౌర్ణమి క్షణాలలో దీపం వెలిగించు కైంకర్యాలు పుష్కరిణికి, శ్రీ స్వామి వారికి చేసి తరించవచ్చు అన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కారాల కమీషన్ గారి కోర్టులో, విజయవాడ
F.A.No: 461 of 2024 IN C.C. No. 52 of 2019
(విశాఖపట్నం జిల్లా వినియోగదారుల ఫోరమ్ -II వారి ఫైలు)
మధ్య:
స్వర్ణా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్,
ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ తలటం సత్య రామ కృష్ణ కిరణ్
....అప్పిలెంట్/అపోజిట్ పార్టీ నెం: 4
అండ్
కర్రి సత్యనారాయణ మూర్తి మరియు ఇతరులు
... రెస్పాండెంట్స్/కంప్లైనెంట్/ అపోజిట్ పార్టీ నెం.1 నుండి 4
నోటీసు
టూ:
రెస్పాండెంట్స్/అపోజిట్ పార్టీలు నెం.2 నుండి 4: చేకూరి నారాయణ రాజు, తండ్రి: లేటు కన్న రాజు, చేకూరి సుధా దేవి, భర్త: నారాయణ రాజు, మరియు చేకూరి త్రినాద్ రవి తేజ వర్మ, తండ్రి: నారాయణ రాజు, (ఈ 3 ముగ్గురికి చిరునామ) నివాసం: డోర్. నెం. 9-1-142, రైల్వేస్టేషన్ దగ్గర, భీముని గుమ్మం వీధి, అనకాపల్లి, విశాఖపట్నం-531001.
పై నెంబరు ఎఫ్.ఎలో రెస్పాం డెంట్స్ /అపోజిట్ పార్టీలు నెం.2 నుండి 4 అయిన మీకు పై స్టేట్ కమీషన్/శ్రీకోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను నోటీసులు పం పినూ మీకు ముట్టనందున ఈ పేపర్ ప్రక టన ద్వారా నోటీసు చేయవలసిందిగా పై కోర్టు /స్టేట్ కమీషన్ వారు అర్డరు వేస్తూ ది.12.12.2024 వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ.10-30 ని.లకు మీరు స్వయంగా గానీ లేదా మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనవలయును. లేని యెడల సదరు అప్పీలును మీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 12.12.2024
యు.అవినాష్,
అప్పిలెంట్/అపోజిట్ పార్టీ నెం.4 తరుపు న్యాయవాది, విజయవాడ,
సెల్: 7729809921.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కారాల కమీషన్ గారి కోర్టులో, విజయవాడ
F.A.No: 462 of 2024 IN C.C. No. 54 of 2019
(విశాఖపట్నం జిల్లా వినియోగదారుల ఫోరమ్ -II వారి ఫైలు)
మధ్య:
స్వర్ణా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్,
ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ తలటం సత్య రామ కృష్ణ కిరణ్
....అప్పిలెంట్/అపోజిట్ పార్టీ నెం: 4
అండ్
వర్లమని లలితాంబ మరియు ఇతరులు
... రెస్పాండెంట్స్/కంప్లైనెంట్/ అపోజిట్ పార్టీ నెం.1 నుండి 4
నోటీసు
టూ:
రెస్పాండెంట్స్/అపోజిట్ పార్టీలు నెం.2 నుండి 4: చేకూరి నారాయణ రాజు, తండ్రి: లేటు కన్న రాజు, చేకూరి సుధా దేవి, భర్త: నారాయణ రాజు, మరియు చేకూరి త్రినాద్ రవితేజ వర్మ, తండ్రి: నారాయణ రాజు, (ఈ 3 ముగ్గురికి చిరునామ) నివాసం: డోర్. నెం. 9-1-142, రైల్వేస్టేషన్ దగ్గర, భీముని గుమ్మం వీధి, అనకాపల్లి, విశాఖపట్నం-531001.
పై నెంబరు ఎఫ్.ఎలో రెస్పాం డెంట్స్ /అపోజిట్ పార్టీలు నెం.2 నుండి 4 అయిన మీకు పై స్టేట్ కమీషన్/శ్రీకోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను నోటీ సులు పంపినూ మీకు ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసిందిగా పైకోర్టు /స్టేట్ కమీషన్ వారు అర్డరు వేస్తూ ది.12.12.2024 వాయిదా వేసియు న్నారు. సదరు వాయిదా రోజు ఉ. 10-30 ని.లకు మీరు స్వయంగా గానీ లేదా మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల అక్షేపణలు తెలుపు కొనవలయును. లేని యెడల సదరు అప్పీలును మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 12.12.2024
యు.అవినాష్
అప్పిలెంట్/అపోజిట్ పార్టీ నెం.4 తరుపు న్యాయవాది విజయవాడ,
సెల్: 7729809921.

ఘనంగా ప్రారంభమైన మాలతాంబ స్పోర్ట్స్ మీట్

ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాశాఖ ఆర్.జె.డి. బి.విజయభాస్కర్

విశాలాంధ్ర - పీఎం పాలెం: 6వ వార్డు పీఎం పాలెంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం చేరువలో గల మాలతాంబ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో వార్షిక క్రీడా సమావేశం (స్పోర్ట్స్ మీట్) బుధవారం సాంకేతిక కళాశాల మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 13, 14 తేదీలలో 2 రోజులు పాటు నిర్వహించే మాలతాంబ వార్షిక క్రీడా సమావేశం (స్పోర్ట్స్ మీట్)లో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. రన్నింగ్, క్రికెట్, త్రోబాల్, షాట్ పుట్, కోకో, రిలేరేస్, పిరమిడ్స్, యోగాసనాలు, కరాటే మార్షల్ ఆర్ట్స్, యుద్ధ కళలు, కల్చరల్ ఈవెంట్స్ విశేషంగా అలరించాయి. మాలతాంబా విద్యాసంస్థల అధినేత ఎన్.ఐ.ఎఫ్.ఎస్. (సీఈఓ), జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్.జె.డి.) బి.విజయకుమార్, సాంకేతిక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుబట్, పీ.ఎం.పాలెం పి.ఎస్.సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే.భాస్కర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ క్రీడల వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరివర్తన వస్తుందని, రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు మంచి భవిష్యత్తు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, విశాఖ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి, పాఠశాల ప్రిన్సిపల్ ఏ.ఆదిమూర్తి, వైస్-ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ బి.హరీష్, పాఠశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్య సేవల్లో పేరు గాంచిన నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

సృజనాత్మక పద్ధతులతో కంటి వైద్యం, కంటి ఆరోగ్యంపై పాఠశాల విద్యార్థులకు బృహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయముగా నిర్వహించారు. ప్రస్తుత విద్యార్థులు సెల్ ఫోన్, కంప్యూటర్ , డిజిటల్ గాడ్జెట్ల తెర మీద ఎక్కువ సమయము గడుపుతున్న సందర్భంగా విద్యార్థుల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచడానికి శంకర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. బుధవారం ముగింపు కార్యక్రమానికిశంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ ముఖ్య అతిథిగా జనరల్ మేనేజర్ కే.రాధాకృష్ణన్ అతిథిగా పాల్గొని ఈ పోటీలలో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. డిజిఎం వి.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో నగరంలోని 86 పాఠశాలల నుండి 415 విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. చిత్రలేఖనం, కంటిఅద్దాల పై పెయింటింగ్, బృంద గాన దేశ భక్తి గీతాలు, డిబేట్, రోల్ ప్లే, స్టోరీ టెల్లింగ్ పోటీలు ఆంగ్లం, తెలుగు భాషల్లో పోటీలు నిర్వహించామని హాస్పిటల్ డి.జి.ఎం. కే.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

నవంబర్ 6 నుండి నవంబర్ 13 వరకు బాలల దినోత్సవం ప్రపంచ దృష్టి దినోత్సవాల్లో భాగంగా ఆసుపత్రి శిక్షణ విభాగం ఉద్యోగులు కె.వినోద్ కుమార్, భువన కళ్యాణి, అలేఖ్య, జయ, దేవి, మంజుల ఈ పోటీలు నిర్వహించినట్లు బంగార్రాజు తెలియజేశారు.

వెలగని విద్యుత్ వీధి దీపాలు చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని లోడగలవాని పాలెం పంచాయతీ పరిధిలో నేలతేరు కాలనీలో గత పది రోజులుగా విద్యుత్ వీధి లైట్లు పనిచేయడం లేదని స్థానిక కాలనీవాసులు గగ్గోలు పెడుతున్నారు. నాయకులకు, అధికారులకు చెప్పిన సరే సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్య పరిష్కారం చేయాలని అధికారులకు, నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు

విశాలాంధ్ర - సింహాచలం: నాయుడు తోటలో కొలువైన శ్రీశ్రీశ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏకసప్తాహం కార్యక్ర మాన్ని 24 గంటలు నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 6 గంటలకి ప్రారంభించి బుధవారం ఉదయం 6 గంటలకి ముగించారు. అందులో భాగంగా కుమారి డబ్బీరు హర్షవర్ధని, డబ్బీరు సత్య ప్రసాద్ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు వారి వారి వాయిద్య బృందాలతో భక్తి గీతాలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: ఇటీవల విజయవాడలో వచ్చిన వరదల కారణంగా జి.వి.ఎమ్.సి. కమీషనరు వారి ఆదేశాల ప్రకారం జోన్-1, భీమిలి జోన్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. భీమలి జోనల్ కమీషనరు వి.ప్రేమ ప్రశన్న ఆధ్వర్యంలో గంటా నూకరాజు, అక్కరమాని రామునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - ఆనందపురం: గ్రామాభివృద్ధి వివిధ శాఖల అధికారుల సమన్వయంతోని సాధ్యమవుతుందని ఎంపీడీవో డాక్టర్ వి.జానకి తెలిపారు. బుధవారం ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు, డ్వాక్రా వివోఏలకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌లకు ఒకరోజు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు నిర్వహించారు. వీరికి మండల ట్రైనర్స్‌గా ఎంపీడీవో జానకి గ్రామ కార్యదర్శులు ధనుంజయ, శ్రీరామ మూర్తి, మండల కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీలో 2025-26 సంవత్సరానికి నిధులు సమీకరణ, ప్రణాళిక తయారుచేసి గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు సుస్థిర అభివృద్ధి ప్రణాళిక చేయుటకు శిక్షణ ఇవ్వడమైనదని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, డ్వాక్రా విఏవో లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కలగాలి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు మేహాద్రిగెడ్డ కాలనీలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో నందవరం సోములు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, అందుకు ప్రతి ఒక్కరు తమ ఇంటిముందు మొక్కలు నాటి చెట్లను పెంచడంలో చొరవ చూపాలని తద్వారా భావితరాల వారికి మంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో వారు జీవించడానికి మనం మొక్కలను నాటి చెట్లను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మొక్కలను నాటి చెట్లను పెంచడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలతోపాటు మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సంవత్సరాంతపు ఆఫర్‌లతో టయోటా కిర్లోస్కర్ మోటార్ కార్లు

విశాలాంధ్ర - విశాఖపట్నం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) దాని ప్రసిద్ధ మోడల్ కార్లు గ్లాన్జా, అర్బన్ క్రూయిజర్ టైసర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లలో ప్రత్యేకమైన లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ హెడ్ శబరి మనోహర్ తెలిపారు. ఇటీవల విడుదల చేసిన ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌లకు అద్భుతమైన స్పందన వచ్చిన తరువాత, స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను అందించడం ద్వారా వినియోగదారుల కేంద్రీకృత పట్ల టొయోటా యొక్క నిబద్ధతను మరింత ముందుకు తీసుకువెళ్లిందన్నారు. స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ కాకుండా, టొయోటాగ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్ రూమియన్ (సీఎన్జీ మోడల్‌లు మినహా)లో రూ.1 లక్ష పైన ప్రత్యేకమైన ఇయర్ ఎండ్ ఆఫర్‌లను అందిస్తోందన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం 75వ వార్డు ఎస్సీ సెల్ నాయకులు ములకలపల్లి పెంటయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 75వ వార్డ్ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి రమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభ్యత్వం చేసుకొనడం వలన అనేకమైన ప్రయోజనాలు కలిగి ఉంటాయని దురదృష్టవశాత్తు హఠాత్ మరణం పొందిన వారికి గతంలో రెండు లక్షల రూపాయలు ఉండేదని ఇప్పుడు ఐదు లక్షలు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ములకలపల్లి పెంటయ్య , మొల్లి రమణ, ముద్దుర్తి సాంబశివరావు, బస అప్పల్ రెడ్డి, మొల్లి అప్పారావు ములకలపల్లి మహేష్, అప్పలరాజు, అరుణ్ కుమార్, గురుమూర్తి, దొమ్మేటి సోమినాయుడు, అప్పారావు తదితరు మహిళలు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ధ్యాన మందిరం ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: ఈనెల 14వ తేదీ గురువారం భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో పునః నిర్మించిన అయ్యప్ప ధ్యాన మందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి అయ్యప్ప స్వామివారికి పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి జరుగుతుందని భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు తెలిపారు. అన్న ప్రసాదం వితరణ జరుగుతుందన్నారు.

టీడీపీ నేత నరసయ్య మృతి

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా సుదీర్ఘంగా పనిచేసి, చిట్టి వెంకట నరసయ్య బుధవారం మృతి చెందారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన స్వర్గీయ చిట్టి వెంకట నరసయ్య మృతికి పలువురు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు సంతాపం తెలిపారు. పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని కోరుకున్నారు.

మధుమేహాన్ని అదుపులో పెట్టుకోవాలి

- నేడు అంతర్జాతీయ మధుమేహ వ్యాధి దినోత్సవం
కిమ్స్ ఐకాన్ డాక్టర్. శ్రావణి తాన్న

విశాలాంధ్ర - విశాఖ సిటీ: డయాబెటిస్ వ్యాధి చికిత్సలో అత్యంత కీలకమైన ఇన్సులిన్ ఇంజెక్షన్‌ను కనుక్కున్న వారిలో ఒకరైన ఫ్రెడరిక్ బాంటింగ్ పుట్టిన తేది నవంబర్ 14 న ప్రతీ సంవత్సరం ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం జరుపుకోవటం ఆనవాయితీ గా వస్తుందని కిమ్స్ ఐకాన్ డాక్టర్. శ్రావణి తాన్న అన్నారు. ఈ సంవత్సరం "బ్యారియర్స్ బ్రేకింగ్, గ్యాప్స్ బ్రిడ్జింగ్" అనే నేపథ్యంతో జరుపుకుంటున్నామని, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 53.7 కోట్ల మంది ప్రజలు డయాబెటిస్ మెల్లిటస్ (మధుమేహం)తో బాధ పడుతున్నారన్నారు. 50 శాతం మంది లో వ్యాధి ఉన్నా నిర్ధారణ జరగట్లేదని, దీనికి గల ప్రధాన కారణం వ్యాధి లక్షణాలపై అవగాహన లేకపోవడం, అశ్రద్ధ వహించడం. మధుమేహంలో చాలా రకాలు ఉన్నా ప్రధానంగా టైప్ 1 రకం, టైప్ 2 రకం, జెస్టేషనల్ అంటే గర్భిణీ స్త్రీలలో వచ్చే మధుమేహం ఎక్కువగా చూస్తామన్నారు. మధుమేహంతో ఉన్న వారిలో దాదాపుగా 90 శాతం కన్నా ఎక్కువగా టైప్ 2 మధుమేహం వ్యాధి ఉన్నవారని, మధుమేహం (డయాబెటిస్ మెల్లిటస్) ఉన్న వారిలో ఎక్కువగా కనిపించే లక్షణాలు తరచూ మూత్రం రావడం, ఆకలి ఎక్కువగా ఉండటం, దాహం ఎక్కువగా ఉండటం, ఆకస్మికంగా బరువు తగ్గడం, ఎక్కువగా అలసట, కంటి చూపు మందగించటం/ మసక బారడం, అరికాళ్ళ మంటలు, తిమ్మిర్లు, చర్మం మీద ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావడం, తరచూ మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు రావడం,గాయాలు తొందరగా మానకపోవడం, చాలా సార్లు ఇందులో ఎటువంటి లక్షణాలు కనిపించక పోవడంతో అశ్రద్ధ వహిస్తుంటారన్నారు. ఇలాంటి సందర్భాల్లో ఈ మధుమేహ వ్యాధి ప్రభావం తీవ్రమై గుండెపోటు, పక్షవాతం వంటి బారిన పడి, అప్పుడు చేసే రక్త పరీక్షల్లో మధుమేహం బయట పడుతుండటం చాలా సార్లు చూస్తున్నామన్నారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు లేకున్నా సరే అధిక బరువుతో ఉన్నవారు, అధిక రక్తపోటు (బిపి)తో ఉన్నవాళ్ళు, గుండె జబ్బులు ఉన్నవారు, మన తల్లిదండ్రులు మధుమేహం ఉన్నప్పుడు, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్న వారు, శారీరక శ్రమ ఎక్కువగా లేనివారు, హెచ్ఐవి వ్యాధితో ఉన్నవారు మధుమేహం (షుగర్ వ్యాధి)కి సంబంధించిన రక్త పరీక్షలు చేయించుకోవడం వలన, దీనిని తొందరగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

టైప్ 2 మధుమేహానికి ముఖ్యమైన కారణాలు:

అధిక బరువు, పరిమితికి మించి కేలరీలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, పని ఒత్తిడి/మానసిక ఒత్తిడికి గురవ్వడం, వంశ పారంపర్యంగా రావడం. ఈ కారణాలలో వంశ పారంపర్యంగా కాకుండా మిగిలిన అన్ని కారణాలు మనం అదుపులో చేసుకోదగ్గవే! చక్కెరతో చేసిన ఆహార పదార్థాలు, మైదా తో చేసిన బిస్కెట్లు, కేక్స్, ఐస్ క్రీమ్స్, శీతల పానీయాలు (కూల్ డ్రింక్స్), ఇతర ప్రాసెసెడ్ ఫుడ్ నీ ఎంత తక్కువగా తీసుకుంటే అంత ఆరోగ్యం. క్రమబద్ధంగా రక్త పరీక్షలు చేయించుకుంటూ, మధుమేహ స్థాయిలు తెలుసుకోవాలి. సరైన ఆహార నియమాలు పాటిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, నిపుణులైన వైద్యుల సలహా మేరకు మందులు వాడుతూ, మధుమేహాన్ని అదుపు లో ఉంచుకోవచ్చు అన్నారు.

క్యాన్సర్, నొప్పులకు లయన్స్ జనరల్ ఆస్పత్రిలో శాశ్వత నివారణ

- ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రిలో మెడ నొప్పి, వెన్నెముక నొప్పి, క్యాన్సర్ నిర్వహణకు చికిత్స ద్వారా నూరు శాతం నివారించడం జరుగుతుందని ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ వి. ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఆర్మ్ ఫ్లోరోస్కోపీ, హై డెఫినిషన్ అల్ట్రాసో నోగ్రఫీని ఉపయోగించి చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. మొదటి ప్రయత్నంలో 100 శాతం విజయం సాధించ వచ్చని తెలియజేశారు. స్పైన్‌లో, అమెరికన్ బోర్డ్ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ మార్గదర్శకాల ప్రకారం స్టెరాయిడ్, అనస్తీటిక్ ఎపిడ్యూరల్ బ్లాక్‌లు, న్యూరోయాక్సియల్ బ్లాక్‌లు, ఫేసెట్ జాయింట్ బ్లాక్‌లు, కండరాల నొప్పిని తగ్గించడం పునరావాసాన్ని నిర్ధారిస్తామని తెలిపారు. మెడ నొప్పి, నడుము నొప్పి, న్యూరోపతిక్ నొప్పి, క్యాన్సర్ నొప్పికి 100 శాతం విజయవంతంగా చికిత్సలు అందిస్తామన్నారు. అన్ని కీళ్ల నొప్పులకు కూడా చికిత్స చేస్తామని, చాలా అనుభవం ఉన్న డాక్టర్ గౌరీ భవన్ పోథిని పర్యవేక్షణలో విస్తృతమైన న్యూరోమస్కులోస్కెలెటల్ మ్యాపింగ్ తర్వాత అన్ని విధానాలు జరుగుతాయన్నారు. ఎండి, ఎం.ఎస్, యూఎస్ఏ, ఎమర్జెన్సీ మెడిసిన్, క్రిటికల్ కేర్ మెడిసిన్, ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ జనరల్ ప్రాక్టీస్‌లో బాగా శిక్షణ పొందిన వైద్యుల చేత తనిఖీల కొరకు మా వెబ్‌సైట్ www.lionscancerhospital.org లేదా అపాయింట్‌మెంట్ కోసం 95604 47813 కాల్ చేసి సంప్రదించవచ్చన్నారు.

సత్తా చాటిన వాగ్దేవి విద్యా మందిర్ విద్యార్థులు సూపర్ స్ట్రైక్ రేట్‌తో విజయాలు...

విశాలాంధ్ర - ఆనందపురం: చిల్డ్రన్స్ డే పురస్కరించుకొని ప్రైవేట్ యునైడెడ్ స్కూల్ అసోసియేషన్ ఆనందపురం మండలం గంభీరం వాగ్దేవి విద్యా మందిర్ పాఠశాల కరస్పాండెంట్ క్రీడా ఆర్గనైజర్ రామినేని రాధాకృష్ణ, ఏసెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్రావు ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన క్రీడలకు ప్రత్యేక ఆదరణ లభించింది. అందులో భాగంగా ఈనెల 8 నుంచి 13 వరకు జరిగే క్రీడా పోటీలలో మొత్తంగా 10 పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని క్రికెట్, త్రోబాల్, వాలీబాల్, కోకో, రన్నింగ్, ఐదు కేటగిరి గేమ్స్ విభాగాల్లో పాల్గొన్నారు. పలు సీనియర్ జూనియర్ విభాగాల్లో క్రీడలు నిర్వహించి పలు క్రీడల్లో వాగ్దేవి విద్యా మందిర్ విద్యార్థిని విద్యార్థులు, పలు క్రీడల్లో అద్భుతమైన విజయాలు సాధించారు. అన్ని విభాగాల్లో 100 పాయింట్లకు గాని 47 పాయింట్లు సాధించి విజయకేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ పాఠశాల విద్యార్థులను అభినందించారు. అలాగే ఈ పాఠశాల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు ఏసెంట్ స్కూల్ శంకర్రావు, ఎస్‌డి స్కూల్ శ్రీధర్, ఈస్టర్న్ విశాఖ పాఠశాల, ఎస్ఎస్ఎస్‌వి స్కూల్, శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ గణేష్, భారతి స్కూల్ దొంతల రామారావు, నిఖిల్ పాఠశాల, శ్రీ దుర్గ పాఠశాల, ఇమ్మానియేల్ పాఠశాల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

మధురవాడ జోన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

జోనల్ స్థాయి సమీక్షను నిర్వహించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ పరిధిలోగల ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ, సంక్షేమ పథకాలు అందిస్తూ నగరాన్ని అభివృద్ధి పరచడంలో కీలక బాధ్యత జీవీఎంసీ అధికారుల దేనని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ రెండవ జోన్ మధురవాడ ప్రాంత అభివృద్ధి, ప్రజల సమస్యలపై కొమ్మాది లో గాయత్రి కాలేజీ సమావేశ మందిరంలో రెండవ జోన్కు సంబంధించి జోనల్ స్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జోనల్ స్థాయిలో స్థాయిలో గల అన్ని విభాగాల్లో ఉన్న సమస్యలను, అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జోనల్ కమిషనర్ వి. సింహాచలం కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి జోన్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, నూతన పనుల ప్రతిపాదనలు తో పాటు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో జోనల్ స్థాయి అధికారులు కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. రెండో జోన్ పరిధిలో తొమ్మిది వార్డులలో 2,63,000 మంది ప్రజలు 118.24 స్క్వేర్ కిలోమీటర్ల గల ప్రాంతంలో నివసిస్తున్నారని, అందులో రూ.1,06,403 నివాసాలు ఉన్నాయని, అందులో 98, 403 ఆస్తి పన్నుల అసెస్మెంట్ లు కలవని, వారికి నిత్యం పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని అలాగే అక్కడ నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. జోన్ పరిధిలో విలీనమైన గ్రామాలకు రోడ్లు కాలువలు పూర్తిస్థాయిలో వేసేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే రోడ్లుకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు పనులు చేసేటప్పుడు ప్రణాళికా యుతంగా పరిశీలించి పనులు చేపట్టాలన్నారు. అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. కొండవాలు ప్రాంతాలలో కొండ చర్యలు విరిగి పడకుండా రక్షణ గోడలు నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. స్మశాన వాటికలలో మౌలిక వసతులు కల్పించాలని, రోడ్లు మరమ్మతులు , విస్తరణ, కాలువలు ,ఫుట్పాత్తులు మొదలైన మౌలిక సదుపాయాలకు ప్రతిపాదన చేపట్టాలన్నారు. ఎక్కువగా పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ నిర్మాణాలను వార్డు ప్లానింగ్ కార్యదర్శులు ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు క్రిమినల్ కేసులు పెడతామన్నారు. త్వరలో అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీ బృందాలను జీవీఎంసీ ప్రవేశపెడుతుందన్నారు. వార్డు కార్యదర్శిలు బాధ్యతతో విధులు నిర్వహించాలని అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. బిల్డింగ్ పర్మిషన్ విషయమై షార్ట్ ఫాల్ నోటీసు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని, అలాగే షార్ట్ ఫాల్స్ ఫీజులను చెల్లించడంలో భవన నిర్మాణదారులను లైసెన్సు సర్వేయర్లు బిల్డింగ్ పర్మిషన్లను పొందేలా భవన నిర్మానుదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ పీ. శివప్రసాదరాజు, చీఫ్ సిటీ ప్లానర్ కే ప్రభాకర్, అదనపు కమిషనర్ ఆర్ సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ , యు సి డి ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీర్ సాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు శాంతిరాజు ,చిరంజీవి ,ఏడుకొండలు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎన్ కిషోర్ బయాలజిస్ట్ సాంబమూర్తి ఏపిడీలు ,ఏసీపీలు , ఆర్వో ,ఆర్ఐలు, అందరు వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ హాల్ ఏపీ హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌ను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-4 పరిధిలో స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి పరిచి పాత మున్సిపల్ ఆఫీసు స్థానం లో ప్రస్తుతం అక్కడ నిర్వహిస్తున్న ఏ.పి.హెచ్.ఆర్.డి ఇనిస్టిట్యూట్‌ను, టౌన్ హాల్‌ను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్, ఏ.పి.హెచ్.ఆర్.డి ఇనిస్టిట్యూట్ హెరిటేజ్ భవనాన్ని, నిర్వాహణను పరిశీలించారు. ఇనిస్టిట్యూట్ భవనం పైభాగాన వర్షానికి నీరు నిల్వ ఉండి భవనంలో సీలింగు నందు నీరు లీక్ అవుతున్న ప్రాంతాలను గమనించి దాని నిర్వహణ బాధ్యత ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ వారు నిర్వహించాలని ఏ.పి.హెచ్.ఆర్.డి.ఎ ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ ను ఆదేశించారు. టౌన్ హాల్ లో సాంస్కృతి కార్యక్రమాలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీరు పి.వి.వి సత్యనారాయణ రాజును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద రాజు, పర్యవేక్షక ఇంజనీరు పి.వి.సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏ.పి.హెచ్.ఆర్.డి.ఎ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్ ప్రసాద్, ఏ.ఎం.ఓ.హెచ్ డాక్టర్ కృష్ణంరాజు, ఏసిపి ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.